## కల్లెడ సహకార సంఘం సీఈవో సస్పెన్షన్

జగిత్యాల రూరల్, మే 27: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ సహకార సంఘం సీఈవో శేఖర్‌ను కలెక్టర్ సత్యప్రసాద్ సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని హబ్సీపూర్, సోమన్‌పెల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్లలోని ధాన్యం కుప్పలు ఎక్కడికక్కడే ఉండడంతో, కొనుగోల్లు వేగవంతం చేయడంలో నిర్లక్ష్యం వహించిన సీఈవో శేఖర్‌ను సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో జగిత్యాల సింగిల్ విండో సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. హబ్సీపూర్, సోమన్‌పెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం.

## ఆదివాసులపై హత్యాకాండను ఆపాలి



ర్యాలీ తీస్తున్న నాయకులు

జగిత్యాల, మే 27: ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం ఆదివాసులపై చేస్తున్న హత్యాకాండను ఆపాలని ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాలలో వామపక్ష, ప్రజాతంత్ర, అంబేద్కర్ వాదులు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నాయకులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ, ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి కాల్పుల విరమణ ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్, పౌర హక్కుల సంఘం నాయకులు పొన్నం రాజమల్లు, భారత్ బచావో నాయకుడు పిట్టల నారాయణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు చింత భూమయ్య, గల్ఫ్ బాధిత సంఘం నాయకుడు జిల్లా రవి గౌడ్, డీఎల్‌పీవో జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, ఏఐకేఎంఎస్ నాయకుడు గాజంగి రాజేశ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఎల్వోసీ అందజేత


ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, మే 27: జిల్లా కేంద్రంలోని 6వ వార్డుకు చెందిన కొలగాని గంగ వెన్నెముక సంబంధిత వ్యాధితో బాధపడుతున్నది. చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా, విషయాన్ని స్థానిక నాయకుడు కొలగాని సత్యం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ. 2.50 లక్షల ఎల్వోసీ మంజూరు చేయించారు. జగిత్యాలలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం గంగ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఎల్వోసి మంజూరు పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొలగాని సత్యం, కూతురు రాజేశ్, రామ్మోహన్ రావు, కత్రోజు గిరి, కోటేశ్వర రావు, చిట్ల మనోహర్, శ్రీనివాస్, రవిశంకర్, శశిపాల్గొన్నారు.

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

సారంగాపూర్, మే 27: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని బీర్‌పూర్ ట్రైనీ ఎస్ఐ రాజు అన్నారు. బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలో ఓ ప్రైవేట్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న యువతకు ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన గంజాయితో అనర్థాలు, నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రంగపేటలో పశు వైద్య శిబిరం


పాడి రైతుకు మందులు అందజేస్తున్న వైద్యులు, తదితరులు

సారంగాపూర్, మే 27: మండలంలోని రంగపేట గ్రామంలో మంగళవారం ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్యలక్ష్మణ్ ఆధ్వర్యంలో ధర్మపురి వెటర్నరీ విభాగం సహకారంతో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వివిధ పరీక్షలు చేశారు. పాడి రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సునీల్, మార్కెట్ కమిటీ సభ్యులు రామడుగు రవి, ఏనుగు జోగిరెడ్డి, తాండ్ర అశోక్ రావు, గీతాంజలి, విజయ్, కాశెట్టి రాజేశ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్, నాయకులు రాంచందర్ రెడ్డి, హరీశ్, మాజీ ఎంపీటీసీ మాలెపు సుధాకర్ విమల, మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి వెంకటనర్సయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు ఆలూర్ గ్రామస్తుల వినతి


కలెక్టరేట్ ఎదుట ఉన్న గ్రామస్తులు

రాయికల్, మే 27: రాయికల్ మండలం ఆలూరు గ్రామంలోని కొత్తచెరువుపై ఒక్క కులానికి సొసైటీ రిజిస్ట్రేషన్ చేయవద్దని కోరుతూ గ్రామస్తులు మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఆలూరు గ్రామపంచాయతీగా ఏర్పడిన నాటి నుంచి సొసైటీ చేయడానికి గ్రామపంచాయతీ, గ్రామసభలో ఎలాంటి తీర్మానం చేయలేదన్నారు. కొత్తచెరువుపై ఏ ఒక్క కులానికి హక్కులు కల్పించవద్దని, ఒకవేళ హక్కులు కల్పిస్తే మిగతా కులాలకు అన్యాయం జరుగుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## గుంత తవ్వారు... పూడ్చడం మరిచారు

కోరుట్ల, మే 27: కోరుట్ల పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే కోరుట్ల –వేములవాడ ప్రధాన రహదారిపై నెల క్రితం గుంతను తవ్వి పూడ్చడం మర్చిపోయారు. పట్టణంలోని వేములవాడ రోడ్డులో నెల క్రితం మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ పడడంతో మరమ్మతుల కోసం రహదారి మధ్యలో పెద్ద గుంతను తవ్వారు. మరమ్మతులు చేసిన తర్వాత గుంతను అలాగే వదిలేశారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిపై గుంత ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చి వేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంత

# కార్యకర్తలకు అండగా ఉంటాం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- ఇబ్రహీంపట్నంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం
- హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్


సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు


మాట్లాడుతున్న కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

ఇబ్రహీంపట్నం, మే 27: తాను, తన కొడుకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఇద్దరం పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గుడేటి కాపు సంఘ భవనంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ఇచ్చిన ఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం హామీ ఏమైందని ప్రశ్నించారు.? సుందరీమణుల కోసం ఒక్కొక్కరికీ 30 తులాల చొప్పున బంగారం ఎలా ఇచ్చావని, తనను కోస్తే ఒక్క రూపాయి కూడా రాదని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డికి రూ.200 కోట్లు ఎక్కడివని ప్రశ్నించారు.? ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసే దిక్కులేదని, కొనుగోళ్లలో జాప్యంతో కేంద్రాల్లో ధాన్యం మొలకెత్తుతున్నదని పేర్కొన్నారు. అధికారం కోసం సాధ్యం కాని హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఈ ఫార్ములా రేస్ వల్ల అప్పటి తెలంగాణ ప్రభుత్వానికి రూ.750 కోట్ల ఆదాయం వచ్చిందని, మరీ ఇప్పుడు అందాల పోటీల వల్ల వచ్చిన ఆదాయం ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ తెలంగాణ ప్రజలపై సీఎం రేవంత్‌రెడ్డికి లేదని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వానికి ఆంధ్రాపై ఉన్న ప్రేమ తెలంగాణపై లేదని, ఇక్కడి ప్రజలు బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇచ్చి పంపిస్తే ఆపార్టీ ఎంపీలు ఒక్కరూ కూడా నిధుల కోసం కొట్లాడడం లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎలాల దశరథరెడ్డి, నాయకులు కంటం రమేశ్, జగన్‌రావు, లక్ష్మారెడ్డి, నేమూరి సత్యనారాయణ, జేడీ సుమన్, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అహల్యా బాయి హోల్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


గెలుపొందిన చిన్నారికి బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

జగిత్యాల, మే 27: రాణి అహల్యా బాయి హోల్కర్ జీవితాన్ని ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షుడు చిట్ల గంగాధర్ పేర్కొన్నారు. సామాజిక సమరసత వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో అహల్యా బాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక గీత విద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంకం లక్ష్మణ్, డాక్టర్ అరుణ, సామాజిక సమరసత వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు కనికరం లచ్చన్న, కార్యదర్శి సోమిరెడ్డి భూమిరెడ్డి, ఉపాధ్యక్షులు సింహరాజు సూర్యనారాయణ, ఆకుతోట వెంకటరమణారెడ్డి, ఇల్లెందుల పురుషోత్తం, శ్రీనివాస్, భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, అశోక్ రావు, లక్ష్మణరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

జగిత్యాల రూరల్, మే 27: పట్టణంలోని జవహర్ విద్యా మందిర్ పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. గురువులను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల పరిశీలన

రాయికల్, మే 27: మండలంలోని ఆలూరు, వీరాపూర్, రాజనగరం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహల్దార్ గణేశ్ మంగళవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, ఇంకా ఎన్ని క్వింటాళ్లు కొనుగోలు చేయాలని కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ట్రాన్స్‌పోర్ట్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

మల్యాల/సారంగాపూర్/ ఇబ్రహీంపట్నం, మే 27: మల్యాల తహసీల్దార్‌గా వసంత, బీర్‌పూర్ తహసీల్దార్‌గా గడప సుజాత, ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా వరప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, తహసీల్దార్లకు నాయబ్ తహసీల్దార్లు, ఆర్ఐలు, ఆయా కార్యాలయాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు నేస్తం కార్యక్రమం

కొడిమ్యాల, మే 27: మండలంలోని పూడూర్ రైతు వేదికలో మంగళవారం వ్యవసాయాధికారులు రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు పంటల సాగుపై వివరించారు. జనుము, జీలుగ విత్తనాలతో పాటు పెసరు, మినుము పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, మండల వ్యవసాయాధికారి జ్యోతి, ఏఈవో శ్రీలత పాల్గొన్నారు.

## ఏపీపీకి సత్కారం


ఏపీపీని సన్మానిస్తున్న డా.చంద్రశేఖర్‌గౌడ్

మెట్‌పల్లి, మే 27: గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గంతో పాటు ఇటీవల మెట్‌పల్లి అసిస్టెంట్ సెషన్స్ కోర్టుకు ఏపీపీగా నియమితులైన చెర్లపల్లి ఆనంద్ గౌడ్‌ను గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ డా. చంద్రశేఖర్‌గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్‌గౌడ్, డైరెక్టర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బంగారు రైతు కార్యక్రమం ప్రారంభం

జగిత్యాల టౌన్, మే 27: జిల్లా కేంద్రంలోని జీఆర్ ఫంక్షన్ హాల్‌లో బంగారు రైతు కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్ సత్యప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు వరికి బదులు ఆయిల్‌పామ్ సాగు చేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. లోహియా కంపెనీ సీఈవో సిద్ధాంత్ మాట్లాడుతూ, జిల్లాలో విలేజ్ అవుట్ రీచ్ క్యాంపెన్ ద్వారా ప్రతి రైతును కలిసి బంగారు రైతులుగా మార్చడానికి లోహియా గ్రూప్ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. జిల్లా ఉద్యాన అధికారి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ సాగుతో ఎకరానికి సంవత్సరానికి నాలుగు నుంచి ఆరు లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ఆర్థిక చేయూత కోసం బ్యాంక్‌ల నుంచి లోన్ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, లోహియా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్ పట్నాయక్, హార్టికల్చర్ అధికారులు స్వాతి, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణానికి నిధులు విడుదల

మెట్‌పల్లి రూరల్, మే 27: మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల పెద్దవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 6.80 కోట్లు విడుదల చేసింది. ఈమేరకు ప్రభుత్వ కార్యదర్శి లోకేశ్‌కుమార్ నిధులు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## పంట మార్పిడి చేయాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

మేడిపల్లి, మే 27: అవసరం మేరకే పురుగు మందులు వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీనివాస్, రజినీదేవి రైతులకు సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమారం మండలం మన్నెగూడెం గ్రామంలో పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీనివాస్, రజినీదేవి రైతులకు పంటల సాగులో గల మెళకువలను వివరించారు. పంట మార్పిడి చేసి అధిక దిగుబడి పొందాలన్నారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ గోపిడి మహిపాల్‌రెడ్డి, ఏఈవో సురేందర్‌నాయక్, రైతులు శంకర్, రాజశేఖర్, జలందర్, రాజేందర్, బుచ్చన్న, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి

మల్లాపూర్, మే 27: గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. రత్నాపూర్, కుస్తాపూర్ గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం ఆయన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడుపుల పుష్పలతతో కలిసి భూమి పూజ చేయడంతో పాటు 40 మంది లబ్ధిదారులకు రూ.15 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ రాజన్న, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

కోరుట్ల/మెట్‌పల్లి టౌన్ , మే 27: కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయాల్లో రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెట్‌పల్లిలో మున్సిపల్ కమిషనర్ మోహన్, మున్సిపల్ మేనేజర్ వెంకటలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, టీఎంసీ సోమిడి శివ, ముజీబ్, కోరుట్లలో మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, డీఈఈ సురేశ్, టీపీవో ప్రవీణ్‌కుమార్, టీపీఎస్ రమ్య, మైనార్టీ, ఎస్టీ, ఈబీసీ, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

రాయికల్/ఇబ్రహీంపట్నం/కోరుట్ల రూరల్/పెగడపల్లి, మే 27: రాయికల్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల, పెగడపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో మంగళవారం రాజీవ్ యువవికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కాగా, రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుదారుల పత్రాలను జడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి గౌతమ్ రెడ్డి, ఎంపీడీవో చిరంజీవి పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవోలు సాంబారి చంద్రశేఖర్, వోదెల రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం శంకర్, ఏపీవో కృపాకర్, ఆయా బ్యాంకుల మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి కూలిన పాఠశాల ప్రహరీ

మెట్‌పల్లి, మే 27: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. పెగ్గెర్ల ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ గోడ కూలినట్లు గ్రామస్తులు తెలిపారు. రూ. 2 లక్షల నష్టం జరిగినట్లు మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు.


కూలిన పాఠశాల ప్రహరీ

## యోగా దైనందిక జీవితంలో భాగం కావాలి

మెట్‌పల్లి రూరల్, మే 27: మన రోజు వారి జీవితంలో యోగా భాగం కావాలని యోగా శిక్షకుడు ప్రదీప్ అన్నారు. జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వెల్లుల్ల గ్రామంలో వైద్యారోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామస్తులతో యోగాసానాలు చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నారాయణ, పల్లె దవాఖాన వైద్యురాలు గజాల ఫిర్దోస్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ప్రమీళ, ఆశ కార్యకర్తలు లావణ్య, సుమిత్ర, వినయ, వసంత, స్వప్న, లత పాల్గొన్నారు.

## జిల్లాలో భారీ వర్షపాతం నమోదు

జగిత్యాల టౌన్, మే 27: జిల్లాలో భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొడిమ్యాల మండలం తిర్మలాపూర్‌లో 101.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, పెగడపల్లి మండలంలో 72.5, కథలాపూర్ మండలంలో 62.8, కొడిమ్యాల మండలం పూడూర్‌లో 61.5, బీమారం మండలం గోవిందారంలో 54.5, మల్యాల మండలం మద్దుట్లలో 52.5, మేడిపల్లి మండలంలో 47.5, సారంగాపూర్ మండలంలో 44.3, కోరుట్ల మండలంలో 38.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## దంచి కొట్టిన వాన


గంగారాంతాండ వెళ్లేదారిలో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

కొడిమ్యాల, మే 27: మండలంలో మంగళవారం సాయంత్రం వాన దంచికొట్టింది. ఆయా గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. సూరంపేట నుంచి గంగారాం తాండ వెళ్లే రోడ్డులో వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## పారిశుధ్య ఆటోలు నడిచినయ్

జగిత్యాల, మే 27: డీజీల్ లేక సోమవారం పారిశుధ్య ఆటోలు నడవలేవన్నది అవాస్తవమని మున్సిపల్ కమిషనర్ స్పందన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో పెద్ద నాలా కిలోమీటర్ పొడవున శుభ్రం చేయాల్సి ఉండగా, ఆ వార్డుల్లో డ్రైవర్లు, చెత్త సేకరణ కార్మికులందరీ సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలోని 48 పారిశుధ్య ఆటోల్లో 40 ఆటోలు నడిచాయని, వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టినట్లు చెప్పారు. వర్షాకాలంలో వరద ముప్పు ఉంటుందని, నాలాలను శుభ్రం చేయించామన్నారు. ప్రజలు గమనించి, పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

సారంగాపూర్, మే 27: బీర్‌పూర్ మండలం ఇందిరానగర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురి మండలం నక్కలపేట గ్రామానికి చెందిన భుక్యా తిరుపతి–భారతి దంపతులు ద్విచక్ర వాహనంపై భారతి తల్లిగారింటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇందిరానగర్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జగిత్యాలకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్‌లోని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు.

## అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల, మే 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ ఈవో శ్రీకాంతరావు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, సునీల్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, కూరగాయల రాములు, ఏఎస్ఐ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వంతెనలపై వర్షపు నీరు

- రాకపోకలకు ప్రయాణికుల ఇక్కట్లు


మల్యాల వెళ్లే దారిలో వరద కాలువ బ్రిడ్జిపై నిలిచిన వర్షపు నీరు

మల్యాల ఎక్స్‌రోడ్ నుంచి మల్యాల బ్లాక్ చౌరస్తా వెళ్లే దారిలో వరద కాలువ వంతెన, గొల్లపల్లె నుంచి రాంపూర్ వెళ్లే దారిలో గల వంతెనపై మంగళవారం కురిసిన వర్షానికి వరద నిలిచింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వంతెనలపై నీరు నిలిచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

-మల్యాల, మే 27

## విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

కోరుట్ల, మే 27: పట్టణంలోని శ్రీఅరుణోదయ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల చేతుల మీదుగా మంగళవారం మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు జిందాల్ కంపెనీ తరపున సెమిస్టార్‌కు రూ. 8400 చొప్పున 20 మంది విద్యార్థులకు మంజూరైన రూ. 1.60 లక్షల విలువైన మెరిట్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే, ఇంటర్ వార్షిక పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన పీఆర్‌బీఎం కళాశాల విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ భవానీ, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకు వినతి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

మెట్‌పల్లి, మే 27: రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులకు ప్రత్యేక కోటా కేటాయించాలని ఎంపీడీవో శంకర్‌కు మంగళవారం దివ్యాంగులు వినతిపత్రం ఇచ్చారు. వివిధ కేటగిరిల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, రాజీవ్ యువ వికాసంలోనూ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా నాయకులు లంకదాసరి శ్రీనివాస్, దేవదాస్, గుగ్లోత్ రవికుమార్, ఓం ప్రకాశ్, అస్గర్‌ఖాన్, బోరె రవి పాల్గొన్నారు.

## సన్న వడ్లు పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తాం


ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, ఏపీఎం సమత

పెగడపల్లి, మే 27: మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో మిగిలిపోయిన సన్న వడ్లను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ఏపీఎం సమతతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చాట్ల భాస్కర్, సీసీలు తిరుపతి, శశికుమార్, నాయకులు తడగొండ రాజు, ఐలేని వంశీధర్‌రావు, కొత్తూరి విష్ణు , రైతులు పాల్గొన్నారు.

## ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

పెగడపల్లి, మే 27: మండల కేంద్రంలో మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీగిరి జీవన్, గౌరవాధ్యక్షుడిగా మూల జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మ్యాకల సుధాకర్, కోశాధికారిగా లెంకలపల్లి కళ్యాణ్, కార్యదర్శిగా వలీ పాషా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కస్తూరి రాకేశ్, జిల్లా అధ్యక్షుడు కస్తూరి శ్యాంసుందర్, జిల్లా కోశాధికారి అంగరి వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## డీఈవోకు సత్కారం

జగిత్యాల టౌన్, మే 27: జిల్లాలో తెలుగు ఉపాధ్యాయులకు ఐదు రోజుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నందుకు గానూ ఆర్‌యూపీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి రామును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు కటుకం నరేందర్, గౌరవాధ్యక్షుడు సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు గంగన్న, కోశాధికారి సత్యంరెడ్డి, సంయుక్త కార్యదర్శి సంద రాజేందర్, తాటిగంటి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చెరుకు మహేశ్వరశర్మ, మడ్డి బాపు, కురుమిళ్ల మల్లేశం, సిద్దె గంగరాజు, లలిత మనోహర్‌రాజు, అనిల్‌కుమార్, ఎస్కే రహీం, ఆనంద్, సిరిమల్లె మల్లికార్జున్, మెరుగు రామచంద్రన్, ఎండీ ముజాకీర్‌పాషా, డీఆర్‌పీ బోగ శివప్రసాద్, చిగురు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


డీఈవోను సన్మానిస్తున్న ఆర్‌యూపీపీ నాయకులు